https://teluguislam.net



# సంపూర్ణ సంఘ బహిష్కరణ

## (TOTAL SOCIAL BOYCOTT)

కేవలం నాలుగు వారాలు లేదా అంతకు తక్కువ కాలంలోనే బహు దైవారాధకులకు నాలుగు పెద్ద విఘాతాలు కలిగాయి. అంటే, హజ్రత్ హమ్జా (ర) ఇస్లామ్ స్వీకారం, ఆ తరువాత హజ్రత్ ఉమర్ (ర) ముస్లిము అయిపోవడం. ఆపై ముహమ్మద్ (స) వారి బేరసారాలను తిరస్కరించడం. ఆ తరువాత బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్ కుటుంబాలకు చెందిన వారంతా ఒక్కటై దైవప్రవక్త(స)ను సంరక్షించే ప్రమాణం చేయడం. ఈ విఘాతాల వల్ల బహుదైవారాధకులు తెల్లబోయారు. తెల్లబోక మరేం చేస్తారు? దైవప్రవక్త(స)ను హతమార్చడానికి ప్రయత్నిస్తే, ఆయన సంరక్షణ కోసం మక్కా కొండలోయ అంతా బహుదైవారాధకుల రక్తంతో ఎరుపెక్కిపోతుంది మరి. అదే కాదు, బహుశా వారంతా తుడుచుకుపోయినా తుడుచుకుపోవచ్చు. అందు కని వారు ప్రవక్త (స) గారి హత్యా ప్రయత్నాన్ని మాని, దౌర్జన్యం చేసే మరో మార్గాన్ని ఎంచుకున్నారు. ఇది వారు ఇప్పటి వరకు అవలంబించిన మార్గాల్లోకెల్లా అతి భయంకరమైన మార్గం.

### హింసాదౌర్జన్యాల కోసం చేసిన ప్రమాణం

ఈ ప్రతిపాదనకు అనుగుణంగా బహుదైవారాధకులు 'ముహస్సిబ్' అనే కొండలోయలోని, ఖైఫె బనీ కనానలో సమావేశమయ్యారు. బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్ కుటుంబాలకు వ్యతిరేకంగా ప్రమాణాలు చేశారు. ఆ ప్రమాణాల్లో దైవప్రవక్త(స)ను చంపడానికి అప్పజెప్పనంతమట్టుకు, ఇక నుండి ఆ రెండు కుటుంబాలతో వివాహాది సంబంధాలు పెట్టుకోము అని, వారితో ఎలాంటి వ్యాపారం (కొనడం, అమ్మడం) సాగించము అని, వారితో కలసి ఉండడంకాని చేయము అని, వారి ఇళ్ళకు వెళ్ళడంగాని, వారితో మాట్లా డడం వగైరాలు జరుపము అని ప్రమాణాలు చేశారు. బహుదైవారాధకులు ఈ బహిష్కరణకు (బైకాట్‌కు) దస్తావేజుగా ఓ పత్రం రాసుకున్నారు. ఆ ప్రమాణ

https://teluguislam.net



పత్రంలో, దైవప్రవక్త (స)ను చంపేయడానికి వారికి అప్పజెప్పనంతమట్టుకు బనీ హాషిమ్ వారితో, వారు ఎలాంటి సంధి సలహాలకు వచ్చినా సరే వినేదేలేదని ప్రమాణం చేస్తూ సంతకాలు పెట్టారు.

ఇబ్నె ఖైమ్ ప్రకారం, ఈ ప్రమాణ పత్రం మన్సూర్ బిన్ అక్రమా బిన్ ఆమిర్ బిన్ హాషిమ్ రాశాడు. మరికొందరి ప్రకారం, నజ్ర్ బిన్ హారిస్ రాశాడన్నట్లు ఉంది. అయితే ప్రామాణికమైన విషయం ఏమిటంటే, దాన్ని రాసినవాడు బగీయన్ బిన్ ఆమిర్ బిన్ హాషిమ్. దైవప్రవక్త (స) శపించినందుకు అతని చేయి పనిచేయకుండాపోయింది.[1]

మొత్తానికి ఆ ప్రమాణం జరిగి, ఆ పత్రాన్ని కాబా గృహంలో వ్రేళ్ళాడ దీయడం జరిగింది. దాని ఫలితంగా అబూ లహబ్ తప్ప బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్‌కు చెందిన వారంతా - వారు ముస్లిములైనా లేదా దైవతిరస్కారులైనా 'షిఅబె అబీతాలిబ్'లో బంధించబడ్డారు. ఈ సంఘటన దైవదౌత్యం లభించిన పదవ ఏట ముహర్రం నెలపొడుపు నాటి రాత్రి జరిగిన సంఘటన.

## షిఅబె అబీతాలిబ్‌లో మూడేళ్ళు

ఈ బహిష్కరణ కారణంగా పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చాయి. ధాన్యం, తినుబండారాలు రావడం ఆగిపోయింది. మక్కాకు అమ్మకానికి వచ్చే ధాన్యాన్నిగానీ ఆహార పదార్థాలనుగానీ బహుదైవారాధకులు పరుగునవెళ్ళి కొనేసేవారు. ఇలా దిగ్బంధంలో ఉన్న ముస్లిముల పరిస్థితి మరింత దిగజారిపోనారంభించింది. వారు ఆకులు, తోళ్ళు తినడానికి కూడా వివశులైపోవలసి వచ్చింది. ఆకలి బాధతో పిల్లలు, స్త్రీలు పెట్టే ఆర్తనాదాలు ఆ లోయ బయట ఉన్న వారికి కూడా వినిపించేవి. వారి వద్దకు ఏదైనా పదార్థం చేరితే అతి కష్టంగా చేరగలిగేది. హుర్మత్ మాసాలు (నిషిద్ధ మాసాలు) తప్ప, ఇతర దినాల్లో బయటకు వచ్చేవారు కాదు. ఆ రోజుల్లోనూ మక్కాకు, ఇతర ప్రదేశాల నుండి వ్యాపారార్థం వచ్చే బిడారాల నుండి తమకు కావలసిన ఆహార పదార్థాలు వారు కొనగలరు కాని బహుదైవారాధకులు ఆ సరుకుకు ధర హెచ్చించి కొనడం వలన అంత ధరపెట్టి దిగ్బంధంలో ఉన్న ముస్లిములు కొనలేకపోయేవారు.

1. జాదుల్ ముఆద్-2/46.

https://teluguislam.net



హజ్రత్ ఖదీజా (ర) గారి అన్న కుమారుడైన హకీం బిన్ హిజామ్ అప్పుడప్పుడు ఎవరి కంటాబడకుండా గోధుమల్ని ఆమెకు పంపించేవాడు. ఓసారి అబూ జహల్ కంటబడగా అతను ఆ గోధుమల్ని అక్కడకు చేరకుండా అడ్డుకోవడం జరిగింది కూడా. పెద్ద రాద్ధాంతం చేయగా అబుల్ బక్తరీ అడ్డుపడి ఆ ధాన్యాన్ని తన మేనత్త వద్దకు పంపించడం జరిగింది.

ఇటు అబూ తాలిబ్‌కు, దైవప్రవక్త (స) గురించి ఆయనకు ఏ ప్రమాదం వచ్చిపడుతుందోనని బెంగగా ఉండేది. అందుకని ఆయన, అందరూ పడుకునే సమయంలో దైవప్రవక్త (స)ను పిలిచి, 'నీవు ఈ ప్రక్కపై పడుకో' అని అందరు వినేటట్లు చెప్పేవారు. ఎందుకంటే దైవప్రవక్త (స)ను ఎవరైనా చంపడానికి పొంచి ఉంటే ఆయన (స) ఎక్కడ నిద్రిస్తున్నారో తెలుస్తుంది. అందరు పడుకోగానే అబూ తాలిబ్ దైవప్రవక్త (స) గారి పడక స్థలాన్ని మార్చివేసేవారు. అంటే తన కుమారులు, సోదరులు లేదా సోదర కుమారుల్లో నుండి ఎవరో ఒకరిని దైవప్రవక్త (స) గారి ప్రక్కపై పరుండబెట్టి, దైవప్రవక్త (స)ను అతని ప్రక్క పైకి పంపి పడుకోబెట్టేవారు.

ఈ దిగ్బంధం ఇలా కొనసాగుతున్నా దైవప్రవక్త (స), ఇతర ముస్లిములు హజ్ రోజుల్లో బయటకు వచ్చి ఇస్లామ్ ధర్మ ప్రచారంలో నిమగ్నులై పోయేవారు. ఈ సందర్భంలో అబూ లహబ్ చేసే దుష్కృత్యాలను గురించి మనం వెనుకటి పుటల్లో చదువుకున్నాం.

## ప్రమాణ పత్రం చించివేత

ఈ పరిస్థితులు పూర్తిగా మూడు సంవత్సరాలు కొనసాగాయి. ఆ తరువాత దైవదౌత్య శకం 10, ముహర్రం[2] మాసంలోనే ఆ ప్రమాణ పత్రం చించివేయడం, దౌర్జన్యకరమైన ఒడంబడిక అంతంకావడం జరిగింది. దీనికి కారణం, ఖురైష్‌కే చెందిన కొందరు ఈ ఒడంబడికకు అయిష్టంగా, మరి కొందరు ఒడంబడికకు అనుకూలంగా ప్రవర్తించడమే. దీనికి వ్యతిరేకంగా ఉన్నవారే దీన్ని చించివేయడానికి పూనుకున్నారు.

దీనికి అసలు కర్త బనూ ఆమిర్ బిన్ లవీ తెగకు చెందిన హిషామ్ బిన్ అమ్రూ అనే వ్యక్తి. ఇతను రాత్రి చీకటిలో ఎవరి కంటాబడకుండా షిఅబె అబూ

2. అబూ తాలిబ్ ప్రమాణ పత్రం చించి వేయబడిన ఆరు నెలలకు చనిపోయారు. అది రజబ్ నెల. అందుకని ఆ నెల ముహర్రం నెలే అని రూఢీగా చెప్పవచ్చు.

https://teluguislam.net



తాలిబ్ లోయలో ధాన్యాన్ని పంపి బనూ హాషిమ్‌ను ఆదుకునేవాడు. ఇతను ఓ రోజు జుహైర్ బిన్ ఉమయ్యా మగ్జూమీ దగ్గరకు వెళ్ళాడు-జుహైర్ తల్లి ఆతికా, అబ్దుల్ ముత్తలిబ్ కుమార్తె. అంటే అబూ తాలిబ్ సోదరి-అతని దగ్గరకు పోయి, "జుహైర్! మీరంతా కడుపునిండా తినడం, త్రాగడం; మరి మీ మామగారు అలా పస్తులుండడం నీకు తెలిసిందే కదా?" అని అడిగాడు. దానికి జుహైర్, "అయ్యో! నేనేం చేయగలను చెప్పు. నాకు మరో మనిషి సహాయపడితే నేనా ప్రమాణ పత్రాన్ని చించిపారేయకపోదునా?" అని తన చేతకానితనాన్ని వెలిబుచ్చాడు.

"అయితే ఇంకో మనిషి కూడా ఉన్నాడు."

"ఎవరాయన?"

"నేనే" అని బదులిచ్చాడు అమ్రూ బిన్ హష్షామ్.

"సరే, మూడో వ్యక్తిని కూడా వెదుకు" అని చెప్పాడు జుహైర్.

హష్షామ్ నేరుగా ముత్‌యిమ్ బిన్ అద్దీ ఇంటికి వెళ్ళాడు. బనూ హాషిమ్ మరియు బనూ ముత్తలిబ్‌తో ముత్‌యిమ్‌కుగల సంబంధబాంధవ్యాల గురించి గుర్తుచేస్తూ, ఖురైష్‌తో కలసి వారికి అన్యాయం చేస్తూ పెట్టే బాధల గురించి ఎత్తిపొడిచాడు - ముత్‌యిమ్ కూడా అబ్దె మునాఫ్ వంశానికి చెందిన వాడే అనేది గమనార్హం- దానికి ముత్‌యిమ్, "అయ్యో! నేనొక్కణ్ణే ఏం చేయ గలను?" అని తన నిస్సహాయ స్థితిని తెలుపగా, హష్షామ్ అందుకొని, "మరొకరు కూడా ఉన్నార"న్నాడు. "అతనెవరు?" అని అడగ్గా 'నేనే' అని బదులిచ్చాడు హష్షామ్.

"అయితే మూడో మనిషిని కూడా తయారుచెయ్యి" అని అన్నాడు ముత్‌యిమ్.

"ఆ పని కూడా అయిపోయింది" హష్షామ్ సమాధానం.

"అతనెవరూ?"

"జుహైర్ బిన్ అబీ ఉమయ్యా."

"అయితే నాల్గో వ్యక్తి కూడా కావాలి" అని సలహా ఇచ్చాడు ముత్‌యిమ్.

https://teluguislam.net



హష్షామ్ బిన్ అమ్రూ హుటాహుటిన అబుల్ బక్తరీ బిన్ హష్షామ్ దగ్గరకు వెళ్ళాడు. ముత్‌యిమ్‌కు చెప్పినట్లుగానే చెప్పాడక్కడ.

"నీవు చెప్పేదాన్ని బలపరచేవారు ఇంకెవరైనా ఉన్నారా?" అని అడిగాడు అబుల్ బక్తరీ.

"ఉన్నారు" అన్నది హష్షామ్ సమాధానం.

"వారెవరూ" అని అడగగా,

"వారు జుహైర్ బిన్ అబీ ఉమయ్యా, ముత్‌యిమ్ బిన్ అద్దీ మరియు నేను" అని సమాధానమిచ్చాడు హష్షామ్.

దాని కోసమని హష్షామ్, జమ్‌అ బిన్ అస్వద్ బిన్ ముత్తలిబ్ బిన్ అసద్ అనే వ్యక్తి దగ్గరికి వెళ్ళాడు. అతనితో మాట్లాడుతూ, బనూ హాషిమ్‌తో అతనికిగల బంధుత్వాన్ని, వారి హక్కుల్ని గుర్తుచేస్తూ విషయం బయటపెట్టాడు. అతను ఇలా అన్నాడు.

"దీని కోసం నన్ను పిలుస్తున్నావా? ఇంకెవరైనా దానికి సిద్ధంగా ఉన్నారా?"

"ఔను" అని తలూపుతూ అందరి పేర్లు చెప్పాడు హష్షామ్.

ఆ తరువాత ఆ అయిదుగురు హజూన్ అనే చోట సమావేశమై, "మనం ఆ ప్రమాణ పత్రాన్ని చించిపారేద్దాం" అనే వాగ్దానాలు చేసుకున్నారు. దానికి ఓ ప్లాను పన్నుతూ జుహైర్ "మొదట నేనే ప్రారంభిస్తాను. అంటే మొదట దాని గురించి నేనే మాట్లాడుతాను" అనుకొని ఎవరింట్లకు వారు వెళ్ళిపోయారు.

తెల్లవారగానే అందరూ మామూలుగా (కాబా వద్ద) వారి వారి స్థానాల్లో వచ్చి కూర్చున్నారు. జుహైర్ కూడా వస్త్రధారుడై అక్కడికి వచ్చాడు. కాబా గృహాన్ని ఏడుసార్లు ప్రదక్షిణ చేసి ప్రజలనుద్దేశించి ఇలా అనసాగాడు:

"ఓ మక్కా ప్రజలారా! మనం తినవచ్చు. వస్త్రాలను ధరించవచ్చు. అటు బనూ హాషిమ్ సర్వనాశనమైపోతున్నారు. వారికి ఏదీ అమ్మడంగాని, కొనడం గాని జరగడం లేదు. దైవసాక్షి! నేను చూస్తూ ఊరుకోలేను. బంధుత్వాన్ని త్రెంచేది, దౌర్జన్యాన్ని పురికొలిపేది అయిన ఆ దుష్ట ప్రమాణ పత్రాన్ని చించి వేయనంతవరకు నేనూరుకోను" అని బిగ్గరగా చాటిచెప్పాడు.

https://teluguislam.net



మస్జిదె హరాంలో ఓ మూలన కూర్చుని ఉన్న అబూ జహల్ లేచి, "నీవు చెప్పేదంతా బూటకం. దైవసాక్షి! దాన్ని చించేయడం కుదరదు" అని అడ్డు కున్నాడు. దానికి జమ్ఆ బిన్ అస్వద్ లేచి, "దైవసాక్షి! నీవే బొంకుతున్నావు. ఈ ప్రమాణ పత్రం మా ఇష్టానికి వ్యతిరేకంగా రాయబడింది. అందులో ఉన్న విషయాలను మేము ఒప్పుకోం" అన్నాడు. ఆ తరువాత ముత్ఇమ్ బిన్ అద్దీ నిలబడి, "మీరిద్దరు చెప్పిందే సబబు. దీనికి వ్యతిరేకంగా చెప్పేవాడు చెప్పేదే తప్పు. మేము ఈ ప్రమాణ పత్రాన్ని చించి దైవం ఎదుట మా కర్తవ్యాన్ని నెరవేర్చుకుంటాం" అన్నాడు.

ఆ తరువాత హష్షామ్ బిన్ అమ్రూ కూడా అలానే అన్నాడు. ఇది గమనించిన అబూ జహల్, "ఓహో! ఇది రాత్రికిరాత్రే నిర్ణయించుకోబడిన విషయమా! ఇది ఇక్కడ కాకుండా మరెక్కడో జరిగిన కుట్రా?" అన్నాడు.

అబూ తాలిబ్ కూడా కాబా మస్జిద్ ఓ మూలలో కూర్చుని ఉన్నారు. ఆయన అక్కడకు రావడానికి కారణం, అల్లాహ్ తన ప్రవక్త (స)కు రాత్రే ఈ ప్రమాణ పత్రం గురించి తెలియజేయడం. ఆ పత్రంపై చెదలు పంపడం జరిగిందనీ, అవి ఆ దమన నీతి సూత్రాలను, బంధుత్వపు తెగతెంపుల వాక్యాలుగల ఆ ప్రమాణ పత్రాన్నీ తినివేశాయని, కేవలం అల్లాహ్ నామం మాత్రమే మిగిలి ఉండేటట్లు చేశాయని తెలియజేశాడు. దైవప్రవక్త (స) ఈ విషయం తమ బాబాయికి తెలియజేశారు. ఈ విషయమే ఖురైష్‌తో చెప్పమనగా ఆయన, "నా సోదర కుమారుడు ఈ విషయం మీతో చెప్పమని, అదే గనక అసత్యమైతే మేము ఆయనకు, మీకు మధ్యన అడ్డుగా నిలవం, మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి. అదే నిజమయితే మీరు మా బహిష్కరణను, మాపై చేసే దౌర్జన్యాన్ని మానుకోండి అని చెప్పడానికే అక్కడికి వచ్చానని" చెప్పారు. దీనికి ఖురైష్, "ఔను. మీరు న్యాయమైన విషయాన్నే చెబుతున్నారు" అని అన్నారు.

ఇటు అబూ జహల్ మరియు ఇతరుల మధ్యన జరుగుతున్న వాగ్వి వాదం సద్దుమణిగింది. ముత్ఇమ్ బిన్ అద్దీ ఆ పత్రాన్ని చించేయడానికి లేచాడు. ఇంకేముంది. దాన్ని చెదలు పట్టి పూర్తిగా తినివేసి ఉంది. కేవలం బిస్మికల్లాహుమ్మా (ఓ అల్లాహ్! నీ పేరుతో) అనే పదాలు మాత్రమే మిగిలి ఉన్నట్లు గమనించారు. ఎక్కడయితే అల్లాహ్ పేరు ఉందో చెదలు ఆ భాగాన్ని ముట్టుకోలేదు.

https://teluguislam.net



ఆ తరువాత ఆ పత్రం చించివేయబడింది. దైవప్రవక్త (స), ఇతరు లందరూ షిఅబె అబీ తాలిబ్ నుండి బయటకు వచ్చేశారు. బహుదైవా రాధకులు దైవదౌత్యపు ఓ గొప్ప సూచనను అక్కడ చూశారు, అయినా వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. దీని ప్రస్తావన ఈ క్రింది ఖుర్ఆన్ వాక్యంలో ఇలా ఉంది.

وَإِنْ يَرَوْا آيَةً يُعْرِضُوا وَيَقُولُوا سِحْرٌ مُسْتَمِرٌّ ۝٢

"కాని, వారి పరిస్థితి ఎలా ఉందంటే, వారు ఏ సూచనను చూసినా తమ ముఖాలను త్రిప్పుకుంటున్నారు." (54 : 2)

కాబట్టి బహుదైవారాధకులు ఈ సూచనను చూసి కూడా ముఖాలు త్రిప్పుకున్నారు. తమ తిరస్కార మార్గంలో కొన్ని అడుగులు ఇంకా ముందుకు వేశారు.[3]

---

3. *బైకాట్‌కు సంబంధించిన ఈ వివరాలు ఈ దిగువ గ్రంథాల ఆధారంగా పొందు పర్చడం జరిగింది. సహీ బుఖారి, మక్కాలో ప్రవక్త(స)ను పై అవరణ అధ్యాయం. 1/216. బహుదైవారాధకులు ప్రవక్త(స)ను వేరుచేయడం అనే అధ్యాయం. 1/548. జాదుల్ ముఆద్-2/46, ఇబ్నె హష్షామ్-1/69,70; ముక్తరస్సీరత్ షేఖ్ అబ్దుల్లా, పుట.106-110 ముక్తరుస్సీరత్ షేఖ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్, పుట. 68-73. ఈ ఆధారాల్లో కొంత అభిప్రాయభేదం ఉన్నా మేము ఖుర్ఆన్ వెలుగులో సరిఅయినవాటినే పొందుపరిచాం.*